## అలరించిన సంకీర్తనలు



మాదాపూర్‌: అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం కస్తూరి వేణుగోపాలరావు సంకీర్తనలు ఆలపించారు. కౌముది గానంలో వందే సద పద్మనాభం, ముద్దుగారే యశోద, కావేటి రంగ నను కానవేరా, నందబంధన గోపాల తదితర కీర్తనలను ఆలపించి అలరించారు. కీబోర్డు ఎస్‌వీఆర్‌ శాస్త్రీ, తబలా శ్రీస్వరూప్‌ సంగీత సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు.

## మహిళతో అమర్యాద ప్రవర్తన.. కేసు నమోదు

మాదాపూర్‌: వాహనాన్ని అడ్డగించి మహిళతో అమర్యాదగా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. మాదాపూర్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌వాసి షేక్‌కమ్రుద్దీన్‌ శనివారం తెల్లవారుజామున 3.30 గంటల నుంచి 4.30 సమయంలో తన భర్తతో కలిసి కారులో వెలుతుండగా గౌరఫౌంటేన్‌ హెడ్‌ దగ్గర గల ఫుడ్‌ కోర్టు వద్ద ఇన్నోవా వాహనంలో ఉన్న వ్యక్తులు ఆమె వాహనాన్ని అడ్డగించి, అమర్యాదగా ప్రవర్తించినట్టు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## భావితరాలకు కళలను అందించాలి

మాదాపూర్‌: చిత్రకళలను భావితరాలకు అందించాలని డాక్టర్‌ బాబురావు అన్నారు. మాదాపూర్‌లోని సిమ్‌సమ్‌ ఆర్ట్స్‌ ఆర్ట్‌క్రాఫ్ట్‌ గలేరియాలో ఎస్పీఎస్‌ఏడీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్‌ ఆర్ట్‌ ఎగ్జిబిషన్‌ను డాక్టర్‌ బాబురావు, ఆశ రాణి శనివారం ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయస్థాయి చిత్రకారులు తమ చిత్రాలను ప్రదర్శించారు. అకాడమిక్‌ డైరెక్టర్‌ సునీష గిన్నిస్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డులను సాధించిన డాక్టర్‌ సీహెచ్‌ సింధూర, డాక్టర్‌ సీహెచ్‌ సుమధురలను అభినందించారు. చిత్రకారులను మొమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈనెల 15 వరకు ఎగ్జిబిషన్‌ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



## ఆర్ట్‌గ్యాలరీలో 'స్థిర'

మాదాపూర్‌: చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌గ్యాలరీలో స్థిర (క్లాత్‌, క్రాఫ్ట్‌) ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. పకారమ్‌ కేరామ్‌, పంచమీ వీవర్స్‌ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో హోమ్‌ డెకార్స్‌, చీరలు అందుబాటులో ఉంచారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషను ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



## మట్టి కుప్పలు తొలగించరా..?

మియాపూర్‌ : ప్రధానరోడ్లపై మట్టి కుప్పలు ప్రమాదకరంగా మారాయి. డివిజన్‌ పరిధిలోని దీప్తిశ్రీనగర్‌ కాలనీ ప్రధానరోడ్డులో మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొన్ని రోజుల కిందట ప్రధాన కాలనీలో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. సీసీ రోడ్డు వాటర్‌ క్యూరింగ్‌ నిమిత్తం వేసిన మట్టిని తొలగించి రోడ్డుపై కుప్పలుగా వేశారు. అదేవిధంగా సీసీ రోడ్డు నిర్మాణపనుల కోసం తవ్విన మట్టిని కూడా రోడ్డు పక్కనే కుప్పలుగా వదిలేశారు. అసలే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మట్టికారి రోడ్డుపైకి చేరే అవకాశముంది. దీంతో ఆ రోడ్డు వెంబడి రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళలో మట్టికుప్పలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



మియాపూర్‌ ప్రధాన రోడ్డుపై మట్టి కుప్పలు

# జామ్‌..జామ్‌..జామ్‌

- ఐటీ కారిడార్‌, ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌, హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలో నిత్యం ఏదో ఒకచోట ట్రాఫిక్‌ ఇబ్బందులు
- వానొస్తే పరిస్థితి మరింత దారుణం



ఎన్‌సీబీ జంక్షన్‌ నుంచి టెలికామ్‌నగర్‌ రోడ్డు పరిస్థితి



బయోడైవర్సిటీ పార్కు కూడలి నుంచి ఐకియా వెళ్లే మార్గంలో..

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌, ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌, హైదరాబాద్‌ నాలెడ్జి సిటీ ప్రాంతాలలో ఏదో ఒక రోడ్డులో నిత్యం ట్రాఫిక్‌ జామ్‌ కావడం పరిపాటిగా మారింది. ఇక చిన్నపాటి వర్షం పడిందంటే చాలు మరిన్ని కష్టాలు. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. ఈ మార్గాలలో నిత్యం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఏదో ఒక రోడ్డులో ట్రాఫిక్‌ జామ్‌ అవుతోంది. గచ్చిబౌలి–కొండాపూర్‌–ఆల్విన్‌కూడలి, మాదాపూర్‌లోని రోడ్లు, మైండ్‌స్పేస్‌–ఐకియా–బయోడైవర్సిటీ పార్కు, రాయదుర్గం– మల్కం చెరువు–దాబా కూడలి–బయోడైవర్సిటీ పార్కు కూడలి, ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి ఐటీ కారిడార్‌, గచ్చిబౌలి స్టేడియం, హఫీజ్‌పేట్‌ రోడ్డు, కొండాపూర్‌ నుంచి బొటానికల్‌ గార్డెన్‌ రోడ్డు.. ఆల్విన్‌కాలనీ నుంచి జీఎస్‌ఎం మాల్‌ మీదగా చందానగర్‌– లింగంపల్లి కూడలి వరకు నిత్యం సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్న పాటి వర్షం పడితే చాలు వాహనాల రాకపోకలు మందగిచడంతో సమస్య మరింత పెరుగుతోంది.ఈ రోడ్లపై ట్రాఫిక్‌ నియంత్రణలో సైబరాబాద్‌ ట్రాఫిక్‌ పోలీసులు తలమునకలవుతున్నారు. ఫ్లైఓవర్లు నిర్మించినా ట్రాఫిక్‌ సమస్య తీరడం లేదు.



ఆల్విన్‌కాలనీ- జీఎస్‌ఎం మాల్‌ ముందు నుంచి వెళ్లే రోడ్డులో..

## చెరువులను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే గాంధీ



కాల్వ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ శ్రీకాంత్‌ తదితరులు

మియాపూర్‌ : నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ సుందరీకరిస్తామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. డివిజన్‌ పరిధిలోని మక్తమహబూబ్‌పేట గ్రామంలోని పెద్ద కుడి చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.1కోటి 93 లక్షలతో చేపడుతున్న మురుగునీటి మళ్లింపు కాల్వ నిర్మాణ పనులకు కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెరువులో మురుగునీరు చేరకుండా కాల్వ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూ పూర్వ విద్యార్థికి ప్రతిష్టాత్మక ఫెలోషిప్‌



గణేష్‌ పుత్తూర్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ పూర్వ విద్యార్థికి ప్రతిష్టాత్మక ఫెలోషిప్‌ మంజూరు అయింది.హెచ్‌సీయూలో 2018–20 బ్యాచ్‌ ఎంఏ హిస్టరీ పూర్వ విద్యార్థి గణేష్‌ పుత్తూర్‌కు బెంగళూరులోని ఫౌండేషన్‌ ఫర్‌ ఇండియన్‌ హిస్టారికల్‌ అండ్‌ కల్చరల్‌ రీసెర్చ్‌ ద్వారా స్థాపించబడిన ప్రతిష్టాత్మక సర్‌ జాదునాథ్‌ సర్కార్‌ ఫెలోషిప్‌ ఫర్‌ ఇండియన్‌ హిస్టరీ లభించింది. ఈ ఫెలోషిప్‌ కింద రూ.15 లక్షల గ్రాంట్‌ను అందిస్తారు. భారతీయ చరిత్రలో పరిశోధన, రచనలు ప్రోత్సహించడానికి ఈ ఫెలోషిప్‌ రూపొందించబడింది. కాగా గణేష్‌ను హెచ్‌సీయూ హిస్టరీ విభాగం ఫ్యాకల్టీ, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

## దేశ పురోగతికి యువత సహకారం అందించాలి



విద్యార్థులతో ఎస్కీ డైరెక్టర్‌ రామేశ్వరరావు, ఫ్యాకల్టీ ప్రతినిధులు

–'ఎస్కీ' డైరెక్టర్‌ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: దేశ పురోగతికి యువత తమ వంతు సహకారం అందించాలని ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా డైరెక్టర్‌ డా.రామేశ్వరరావు సూచించారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లోని చాణక్య సెమినార్‌ హాల్‌లో శనివారం పీజీ విద్యార్థులు 2023–25 బ్యాచ్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేయడం, నిజాయితీ, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జ్ఞాపకాలు, అనుభవాలు పంచుకున్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అనంతరం నిర్వహించిన ఆటాపాట, సంగీత కార్యక్రమాలతో అదుర్స్‌ అనిపించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం హర్షణీయం



చందానగర్‌ : హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధి మదీనాగూడ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్‌ యాదవ్‌ పేర్కొన్నారు. శనివారం సంస్థల ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోకి వరద నీరు రాకుండా పనులు చేపట్టాలని సూచించారు. వర్తుసా సంస్థ ప్రతినిధులు పూజ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌, నాయకులు సురేష్‌, కుమార్‌, యాదగిరి, శివ, రమేష్‌, ఆశ తదితరులు పాల్గొన్నారు.

## భెల్‌ టౌన్‌షిప్‌ రోడ్డులో రాకపోకలకు అనుమతించాలి

ఎంఐజీ కాలనీలో పెన్షనర్స్‌ అసోసియేషన్‌ ధర్నా



నిరసన తెలుపుతున్న పెన్షనర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: భెల్‌ ఎంఐజీ కాలనీ నుంచి భెల్‌ టౌన్‌షిప్‌కు వెళ్లే రోడ్డులో రాకపోకలకు అనుమతించాలని డిమాండ్‌ చేస్తూ తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌ అండ్‌ రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌ అండ్‌ రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె.వైకుంఠరావు మాట్లాడుతూ భెల్‌ ఎంఐజీ కాలనీ ఫేజ్‌–1 నుంచి బుధవారం సంత రోడ్డులో హాస్పిటల్‌కు వెళ్ళే రోడ్డును మూసివేయడంతో సీనియర్‌ సిటిజన్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భెల్‌ హాస్పిటల్‌కు వెళ్ళాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని భెల్‌ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని విమర్శించారు. పెహల్గామ్‌ దాడి నేపథ్యంలో రోడ్డును మూసివేసి నెలలు గడుస్తున్నా తిరిగి తెరవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భెల్‌ యాజమాన్యం స్పందించాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి, బి.రామారావు, ఉపాధ్యక్షులు జె. వెంకట్‌రెడ్డి, దేవంద్రచారి, పాటి సత్యనారాయణ, టి.ప్రభాకర్‌రావు, బీ.ఎల్‌ నాయుడు, గిరిధర్‌సింగ్‌, తారాసింగ్‌, నారద తదితరులు పాల్గొన్నారు.

## తవ్వారు.. వదిలేశారు



మియాపూర్‌ : ప్రధాన రోడ్లను తవ్వి మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్‌ మక్తమహబూబ్‌పేటలో ప్రధాన రహదారిని పైపులైన్‌ నిమిత్తం తవ్వారు. పనులు పూర్తయ్యాక అలాగే వదిలేయడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## 29న సద్దుల బతుకమ్మ.. 2న దసరా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలో సద్దుల బతుకమ్మ పండగను సోమవారం 29వ తేదీన, .. దసరా పండుగను అక్టోబర్‌ 2, గురువారం నిర్వహించుకోవాలని ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. శనివారం ఉదయం పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయంలో పండుగ తేదీలపై కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్‌ 29వ తేదీ, సోమవారం సాయంత్రం పట్టణంలోని సాకి చెరువు కట్టపై సద్దుల బతుకమ్మ సంబరాలు జరుగుతాయని తెలిపారు. దసరా అక్టోబర్‌ 2న సాయంత్రం 5 గంటలకు జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ధ్వజారోహణం నిర్వహించి, జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్‌ ఫంక్షన్‌ హాల్‌ ప్రాంగణంలో శమీ చెట్టుకు పూజలు చేయాలని నిర్ణయించారు. అనంతరం సాయంత్రం ఏడు గంటలకు మైత్రి మైదానంలో మహిషాసుర దహనం ఉంటుందని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, మాజీ జెడ్పీటీసీలు జైపాల్‌, మాణిక్యం, మాజీ కార్పొరేటర్లు శంకర్‌ యాదవ్‌, సపానదేవ్‌, నరసింహాచారి, నర్ర భిక్షపతి, ప్రకాష్‌ రావు, పట్టణ పుర ప్రముఖులు, పురోహితులు, సీనియర్‌ నాయకులు పాల్గొన్నారు.

## ఛాప్‌ -2025

మాదాపూర్‌: శిల్పారామంలో ఛాప్‌– 2025 ఎగ్జిబిషన్‌ సందర్శకులను ఆకట్టుకుంటుంది. లెదర్‌బ్యాగ్స్‌, వుడ్‌ కార్వింగ్‌, పెయింటింగ్స్‌ ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. 24 క్యారెట్‌ గోల్డ్‌ రాజస్థాన్‌ పెయింటింగ్‌ ల్యాంప్‌ అందుబాటులో ఉంది. దీని ధర 35వేలు. స్టోరేజ్‌ బాక్సులు, పండ్ల బుట్టలు, చపాతీ బాక్సు, టేబుల్‌మ్యాట్‌ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ఆత్మకల్ప ఇంసెంబ్లీ, దేవి గిరిష్‌చంద్ర శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో రంగపూజ, గణేశస్తుతి, కృష్ణ శబ్దం, నటేశకౌతం, బృందావన నిలయే, శివాష్టకం, దశావతారశబ్దం, ధనశ్రీ తిల్లాన తదితర అంశాలను కళాకారులు ఆత్మిక, గిరీష్‌చంద్ర, సహస్రదేవి, భవిష్య, తన్వి, కమలిక, స్నేహిక తదితరులు ప్రదర్శించారు.













స్టాలిన్‌ నగర్‌ కాలనీల్లో..

న్యూ ప్రశాంత్‌నగర్‌ కాలనీలో..

డీకే ఎన్‌క్లేవ్‌లో ..

# రోజుల తరబడి..

- కాలనీ, బస్తీలలో పేరుకుపోతున్న చెత్త
- తొలగించని వైనం.. వర్షాలకు కుళ్లి దుర్వాసన





మియాపూర్‌ : పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బస్తీలు, కాలనీలలో రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాలలో చెత్తపేరుకుపోతోంది. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో గుట్టలుగా పేరుకుపోయి వర్షాలకు కుళ్లి దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు, ఈగలు, స్వైరవిహారం చేయడంతో కంటిమీద కునుకులేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ఎంఏనగర్‌, ప్రశాంత్‌నగర్‌, న్యూ ప్రశాంత్‌నగర్‌, స్టాలిన్‌నగర్‌, పీఏనగర్‌, న్యూ కాలనీ ఏఎస్‌ రాజునగర్‌, డీకే ఎన్‌క్లేవ్‌ , రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయింది.
- చెత్త సేకరణ రిక్షాలు కాలనీ, బస్తీల్లోకి రావడం లేదనే ఆరోపణలు వచ్చాయి.
- పారిశుద్ధ్య అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కాలనీలు, బస్తీలలో ఎక్కడపడితే అక్కడ పేరుకుపోతుంది.
- దీనికి తోడు కొందరు ఇళ్లలోని చెత్తను జీహెచ్‌ఎంసీ రిక్షా వారికి ఇవ్వకుండా రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్తను పారబోస్తున్నారు.
- ప్రధాన రహదారులు, కూడళ్లలో, బస్టాప్‌ల వద్ద చెత్తవేసేందుకు ఏర్పాటు చేసిన తడి,పొడి డబ్బాలు కనిపించడంలేదు. కొన్నిచోట్ల డబ్బాలు విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారు. వర్షాలకు చెత్త కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది.
- జీహెచ్‌ఎంసీ శానిటేషన్‌ అధికారులు స్పందించి స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



దీప్తిశ్రీనగర్‌ రేగులకుంట చెరువు పక్కన పేరుకుపోయిన చెత్త



ఎంఏనగర్‌ కాలనీ ఖాళీ ప్రదేశంలో ..



రెడ్డి కాలనీలో రోడ్డు పక్కన చెత్తచెదారం